## క్లుప్తంగా

### ఇసుక అనుమతులు రద్దు చేయాలని ధర్నా



మిడ్జిల్: మండలంలోని కొత్తపల్లిలో పట్టా భూముల్లో ఇసుక తరలింపునకు ఇచ్చిన అనుమతులు వెంటనే రద్దు చేయాలంటూ శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇసుక రవాణాను ప్రోత్సహిస్తున్న తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు తగ్గి రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తుతాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతి, బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్, నాయకులు బుచ్చయ్య, బీరయ్య, భీమయ్య, వెంకట్, ఆంజనేయులు శేఖర్, సైదులు, బాలమల్లయ్య పాల్గొన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లికి చెందిన గాజులపేట అంజన్న, పూజారి ఆశన్న అనారోగ్యం బారినపడి కొంతకాలం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందారు. వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను శుక్రవారం ఎంపీటీ అనీల్ కుమార్, ఆర్‌ఐ తిరుపతయ్య గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదలకు వైద్యఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### 'ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలగించాలి'

జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్మికులను అసభ్య పదజాలంతో ఇష్టం వచ్చినట్లు దూషిస్తూ వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని పుర కార్మికులు, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు మహేష్ శుక్రవారం ఆరోపించారు. వెంటనే అతడిని విధుల నుంచి తప్పించి రెగ్యులర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్‌కు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కార్మిక దినోత్సవం రోజున ఎమ్మెల్యే కార్మికులకు ఇచ్చిన దుస్తులు ఇంకా కొందరికి పంపిణీ చేయలేదని, వెంటనే అందించాలని కోరారు. ఈ విషయంపై పుర కమిషనర్ లక్ష్మారెడ్డి స్పందిస్తూ.. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సగం వార్డుల్లో విధులు నిర్వర్తించాలని ఇప్పటికే సూచించామన్నారు. దుస్తుల పంపిణీలో నిర్లక్ష్యం లేదని, ఎవరెవరికి అందించారో జాబితా తయారీకి ఆలస్యమైందని, వెంటనే పంపిణీ చేస్తామని బదులిచ్చారు.

### నేడు డీసీసీ ఇన్‌చార్జ్ సాంబయ్య రాక

జడ్చర్ల: కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ సాంబయ్య శనివారం పట్టణానికి వస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక చంద్రాగార్డెన్‌లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు నియోజకవర్గంలోని మండలాల కాంగ్రెస్ నాయకులతో సమావేశం అవుతారని.. పార్టీ మండల అధ్యక్ష పదవికి ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# డెంగీపై అప్రమత్తత అవసరం



నవాబ్‌పేటలో డెంగీ అవగాహన ర్యాలీ ప్రారంభిస్తున్న మండల వైద్యాధికారి డా. శ్రావణ్‌కుమార్

నవాబుపేట: డెంగీపై అప్రమత్తత అవసరమని.. ప్రజలు నిరంతరం శుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి డా. శ్రావణ్‌కుమార్ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. డెంగీ దోమ అపరిశుభ్రత ఎక్కడ ఉంటే అక్కడికి వచ్చేందుకు సిద్ధంగా ఉంటుందని, కాబట్టి ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని సూచించారు. డెంగీకి ఆస్పత్రుల్లో చికిత్స అందుబాటులో ఉందని.. ఎవరూ భయభ్రాంతులకు గురికావద్దని, అనుమానితులు వెంటనే స్థానిక ఆస్పత్రికి వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా డెంగీ దోమల నివారణ, ముందుజాగ్రత్త చర్యలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాఘవేందర్, శ్రీనివాస్, లక్ష్మయ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

**చిన్నచింతకుంటలో..**

చిన్నచింతకుంట: జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. దోమలతో డెంగీ సోకుతుందని, నివారణకు తగిన జాగ్రతలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**అప్రమత్తంగా ఉండాలి..**

దేవరకద్ర రూరల్: డెంగీ సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పేరూర్ పీహెచ్‌సీ వైద్యురాలు డా.రాధిక అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆమె డెంగీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**జాగ్రత్తలతో వ్యాధులు దూరం..**

కోయిల్‌కొండ: ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారి డా. అబ్దుల్ సమీ సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని కోత్లాబాద్‌లో వైద్యసిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం మాట్లాడారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయని.. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలన్నారు. కుండలు, పాత టైర్లు, ప్లాస్టిక్ కంటైనర్లు, నీటికూలర్లు, పూలతొట్లు, వాటర్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచడంతో దోమలు వ్యాప్తి చెందకుండా ఉంటాయని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

**అవగాహన ర్యాలీ..**

మిడ్జిల్: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలకేంద్రంలో ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ బారిన పడకుండా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయ్యాబ్‌ఖాన్, సంపత్, దేవయ్య, జంగయ్య, గీత, పారిజాత, పద్మ, ఆశాలు పాల్గొన్నారు.



చిన్నచింతకుంటలో..



కోత్లాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



మిడ్జిల్‌లో..

### రేణుక ఎల్లమ్మ, నాగమ్మ బండారు ఉత్సవం



చిన్నచింతకుంట: మండలంలోనీ పర్దీపురం గ్రామంలో శుక్రవారం రేణుక ఎల్లమ్మ, నాగమ్మ బండారు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గొల్ల కురుమలు బండారు (పసుపు)ను గ్రామంలో ఊరేగించి ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. ఉత్సవానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గొల్ల కురుమలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు వీడ్కోలు



మహమ్మదాబాద్: ఇటీవల బదిలీ అయిన తహసీల్దార్ తిరుపతయ్యకు శుక్రవారం కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఏలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన విధుల్లో తనకు సహకరించిన కార్యాలయ సిబ్బంది, మండల నాయకులు, ప్రజలు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మురుగు కాల్వల పరిశీలన

జడ్చర్ల టౌన్: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు పుర పరిధిలోని 4, 9, 10, 15, 17 వార్డుల్లో శుక్రవారం పుర కమిషనర్ లక్ష్మారెడ్డి పర్యటించారు. ఆయా వార్డుల్లో మురుగు కాల్వల నిర్మాణానికి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. పెద్ద కాల్వ నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరయ్యాయని.. ఆ నిధులతో కాల్వల నిర్మాణం చేయనున్నారు. 9వ వార్డులో కృష్ణారెడ్డి ఇంటి వెనుక భాగంలో మురుగునీరు నిల్వడంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట కౌన్సిలర్లు కుమ్మరి రాజు, చైతన్య చౌహాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేష్ ఉన్నారు. ఆయా వార్డుల్లో వేస్తున్న సీసీ రోడ్లను సైతం వారు పరిశీలించారు.



9వ వార్డులోని మురుగు కాల్వను పరిశీలిస్తున్న పుర కమిషనర్, వార్డు కౌన్సిలర్లు

**చైర్‌పర్సన్ పర్యటన..**

పలు వార్డుల్లో పుర కమిషనర్ లక్ష్మారెడ్డితో కలిసి చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత పర్యటించారు. వర్షాకాలంలో మురుగు కాల్వల్లో ఎక్కడా చెత్తా చెదారం నిల్వకుండా చూడాలని ఆమె ఆదేశించారు. వరద నీరు నిల్వకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

నవాబుపేట: లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం త్వరగా పూర్తి చేసుకొని సొంతింటి కల నెరవేర్చుకోవాలని హౌసింగ్ పీడీ వైద్యం భాస్కర్ కోరారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్‌లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రూ.5 లక్షలతో నమూనా ఇందిరమ్మ ఇంటిని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిందని, దాని ప్రకారం నిర్మించుకుంటే ఎలాంటి అప్పులు లేకుండా ప్రభుత్వం మంజూరు చేసిన డబ్బులతో పూర్తవుతుందని వివరించారు. మంజూరైన అన్ని ఇళ్లు త్వరగా పూర్తి చేసేలా మండల అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు చేయించాలని సూచించారు. గ్రామ, మండలస్థాయి అధికారులతో పాటు సంబంధిత అధికారులు సైతం ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక పరిశీలన చేయాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ విజయకుమార్, ఏఈ నర్సింహారెడ్డి, ఎంపీడీఓ జయరాంనాయక్, బద్రూనాయక్, మార్కెట్ వైస్ చైర్మన్ తులసీరాంనాయక్, వాసుయాదవ్, కృష్ణయ్య, సంతోష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కొల్లూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధికారులు

# ఉత్సాహంగా జాంద్ర ప్రీమియర్ లీగ్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జాంద్ర ప్రీమియర్ లీగ్–3 క్రికెట్ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జేపీఎల్‌లో 21 జట్లు పాల్గొంటునగా ఈనెల 18వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. అదే విధంగా ఓపెన్‌స్థాయిలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నారు. జేపీఎల్ టోర్నమెంట్‌లో మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకొని బ్యాటింగ్ చేశారు. తన హయాంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియం అభివృద్ధితో పాటు తెలంగాణలో తొలిసారిగా రూ.12కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేసినట్లు చెప్పారు. గ్రామాల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి చేసి అవసరమైన వసతులు కల్పించినట్లు చెప్పారు. చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని యువతను కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, జాంద్ర నాయకులు సద్దె పవన్ కుమార్, టంకశాల మల్లేష్, పోతినెపల్లి అనిల్‌కుమార్, దోమ సాయికుమార్, నాగలి విశ్వకాంత్, వన్నాడ అనిల్‌కుమార్, గడిగె చంద్రశేఖర్, కనికె పవన్‌కుమార్, బుట్టా అవినాష్, ముచ్చర్ల శ్రీశైలం, కనికె శివకుమార్ పాల్గొన్నారు. జాంద్ర ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్‌లో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# హన్వాడలో నీలిచిత్రాల కలకలం



డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

**డీఎస్పీకి ఫిర్యాదు చేసిన బీజేపీ నాయకులు**

హన్వాడ: ఫొటోగ్రఫీ పేరుతో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్న ఉదంతం హన్వాడలో వెలుగుచూసింది. ఈ ఘటనపై బీజేపీ నాయకులు మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. హన్వాడలో ఫిజా ఫొటోస్టూడియో నిర్వాహకుడు ఎండీ ఎజాస్ తమ వద్దకు వచ్చే ఓ వర్గం యువతులను లోబర్చుకొని అదే స్టూడియోలో సీక్రెట్‌గా నీలిచిత్రాలు చిత్రించే దారుణానికి తెగబడ్డాడు. అలా చిత్రించిన నీలిచిత్రాలతో సదరు యువతులను బెదిరించి పలు మార్లు లైంగికంగా వేధించడం, వారి నుంచి నగదు డిమాండ్ చేసేవాడు. ఇలా దాదాపు 30 మంది యువతులతో నీలిచిత్రాలు చేసిన వీడియోలను పోలీసులకు సమర్పించామని, దీని వెనకాల ఎంత మంది ఉన్నారనేది పోలీసులు విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. అంతకు ముందు బీజేపీ నాయకులు కొద్దిసేపు హన్వాడ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అక్కడికి వచ్చిన డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి బుచ్చిరెడ్డి, మండలాధ్యక్షుడు లింగన్న, నాయకులు వెంకటయ్య, రమణారెడ్డి, కృష్ణయ్యగౌడ్, వేణు, శేఖర్, మహేందర్‌రెడ్డి, చెన్నయ్య, జూక్యానాయక్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

**పోలీస్ పికెటింగ్..**

నీలిచిత్రాల ఉదంతంతో హాట్‌టాఫిక్‌గా మారిన ఫిజా ఫొటో స్టూడియో ఎదుట పోలీస్ పికెటింగ్ నిర్వహించారు. నీలిచిత్రాల ఉదంతానికి ఒడిగట్టిన ఎజాస్ ఫొటో స్టూడియోపై స్థానిక బీజేపీ, భజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు దాడి చేస్తారనే విషయం తెలియడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పిలిపించి రాత్రంతా పికెటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే విషయం తెలిసిన షట్టర్ యజమాని ఫొటో స్టూడియోను ఖాళీ చేయించారు.

### పెద్ద కాల్వ.. ప్లాస్టిక్‌మయం



పుర పరిధిలోని 17వ వార్డులో ఉన్న పెద్ద కాల్వ చెత్త చెదారంతో పాటు వందల సంఖ్యలో వినియోగించిన ప్లాస్టిక్ సీసాలు, కవర్లతో నిండిపోయింది. శుక్రవారం కాల్వను పుర చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి చూసి అవాక్కయ్యారు. పురపాలికలోని ఏ ప్రాంతంలో చూసినా ఇలాంటి పరిస్థితులే దర్శనమిస్తున్నాయి.

– జడ్చర్ల టౌన్

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈఓ మంజులాదేవి



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నామని ఎంఈఓ మంజులాదేవి స్పష్టం చేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కావేరమ్మపేట చౌరస్తాలో నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించామని గుర్తుచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా మౌలిక వసతులు కల్పిస్తున్నామని.. పిల్లలను నిర్భయంగా చేర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో కావేరమ్మపేట ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు వర్ష, పద్మ, సీఆర్పీ డేవిడ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కోడ్గల్‌లో..**

మండలంలోని కోడ్గల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మారేపల్లి శ్రీనివాసులు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు తాహెర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు**

కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులకు బోధన అందుతుందని ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా రెండు జతల యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు అందిస్తున్నట్లు వివరించారు. గ్రామంలోని ప్రతి పిల్లవాడిని బడికి పంపించాలని ఆయన కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హన్వాడ: మండలకేంద్రంలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ దేవేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ ఉన్నందున ఇబ్రహీంబాద్, నాగినోనిపల్లి, హన్వాడ, సల్లోనిపల్లి, అంబటోనిపల్లి, కొనగట్టుపల్లి, బుద్దారం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

### బార్ కేటాయింపునకు టెండర్ల ఆహ్వానం

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో లైసెన్స్ పునరుద్ధరించుకోని బార్ కేటాయింపునకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి జూన్ 6 వరకు మద్యం వ్యాపారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని.. ఈఎస్, డీసీ కార్యాలయాల్లో దరఖాస్తుల సమర్పణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. జూన్ 13న కలెక్టర్ లక్కీడిప్ (లాటరీ) ద్వారా లైసెన్స్‌దారుడిని ఎంపిక చేస్తుందని.. బార్ వార్షిక లైసెన్స్ ఫీజు రూ.42 లక్షలు ఉంటుందని వివరించారు.

### డీసీసీ అధ్యక్ష పదవి ముదిరాజ్‌లకు ఇవ్వాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): మొదటి నుంచి పార్టీ కోసం పని చేసిన ముదిరాజ్ వర్గానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కేటాయించాలని సంఘం జిల్లా నాయకుడు రాకేష్ పటేల్ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే పాలమూర్‌లో అత్యధికంగా ఉన్న ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని.. అలాంటి వారికి పదవి ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ముదిరాజ్‌లకు రాజకీయ పదవులు ఇవ్వడంలో వివక్ష చూపుతోందని ఆరోపించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినా ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కీలకపాత్ర పోషించిన ముదిరాజ్‌లకు పదవులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.

### 'యువకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

హన్వాడ: ఫొటోగ్రఫీ మాటున నీలిచిత్రాలు తీసి యువతుల జీవితాలతో చెలగాటమాడిన ఫొటోగ్రాఫర్ ఎజాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని హన్వాడ మసీద్ కమిటీ అధ్యక్షుడు షబ్బీర్ హుస్సేన్, అంజాద్ హుస్సేన్, ఎండీ అలీం తదితరులు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. యువతిని లోబర్చుకొని నీలిచిత్రాలు చిత్రీకరించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. సభ్యసమాజం తలదించుకునేలా వ్యవహరించిన ఎజాస్, అతడి వెనక ఉన్న వారిని సమగ్రంగా విచారించాలని, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

### నేడు ఉపాధిహామీ ప్రజావేదిక

అడ్డాకుల: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ పులేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024, ఏప్రిల్ 1 నుంచి 2025, మార్చి 31 వరకు మండలంలోని 15 గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై 4వ విడత సామాజిక తనిఖీ బృందాలు విచారణ చేపట్టినందున వాటి నివేదికపై చర్చ జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, రైతులు, కూలీలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

### సార్వత్రిక సమ్మె వాయిదా



జడ్చర్ల టౌన్: దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేయాలని కేంద్ర కార్మిక సంఘాలు నిర్ణయించాయని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ వెల్లడించారు. శుక్రవారం పుర పాత కార్యాలయం వద్ద నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గురువారం సమావేశమైన కార్మిక సంఘాల నాయకులు దేశంలోని పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని భారత్–పాక్ దేశాల మధ్య ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో సమ్మె వాయిదా వేసినట్లు చెప్పారు. కశ్మీర్‌లో జరిగిన ఘాతుకాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని.. భారత సైన్యానికి ఎప్పుడూ అండగా ఉంటామని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయని తెలిపారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్ల అమలు దిశగా దూకుడుగా ముందుకు వెళ్తుందని విమర్శించారు. జూలై 9 నాటి సమ్మె గురించి ప్రచారం చేయాలని, ముఖ్యంగా యజమానులు, అధికారులకు అవసరమైన సమాచారం ఇవ్వాలన్నారు. అయితే మే 20న పని ప్రదేశాల్లో స్థానిక, జిల్లాస్థాయిలో సమీకరణ జరగాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఖమర్ అలి, తెలుగు సత్తయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్ పాల్గొన్నారు.

### నేడు రక్తదాన శిబిరం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఏగూర్ ప్రైం ఆస్పత్రిలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి నిర్వాహకుడు డా. ఏగూర్ అంకిత్ శుక్రవారం తెలిపారు. యువత రక్తదానం చేసి మరొకరి ప్రాణదాతలు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

### బస్సు, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

మహమ్మదాబాద్: ఆగి ఉన్న బస్సును బైక్ ఢీకొని ఇద్దరు గాయాల పాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గండేడ్ మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన డబ్బుల చెన్నారెడ్డి తన కుమార్తె కవితతో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం మహబూబ్‌నగర్ వైపు బయలుదేరారు. మార్గమధ్యంలో మొకర్లాబాద్ గేట్ వద్ద ప్రమాదవశాత్తు ఆగి ఉన్న బస్సును ఢీకొనడంతో వారిద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన ప్రయాణికులు, స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



నాగన్నగౌడ్ (ఫైల్)

భూత్పూర్: మండలంలోని కొత్త మొల్గరకు చెందిన పొల్కం నాగన్నగౌడ్ (55) హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. పొల్కం నాగన్నగౌడ్ గురువారం రాత్రి పొలం నుంచి ఇంటికి వెళ్తూ గ్రామ సమీపంలోని కమలోద్దీన్ దర్గా వద్ద రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో కొత్త మొల్గర నుంచి బిజినేపల్లి వైపు వెళ్తున్న మోటర్‌సైకిల్ ఢీకొంది. దీంతో అతడిని వెంటనే జిల్లా ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతిచెందినట్లు ఎస్‌ఐ వివరించారు. భార్య పొల్కం ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు బైక్ నడుపుతున్న జవాజీ గంగాధర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.